క్లుప్తంగా

సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం



వర్ధన్నపేట : తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఓ అనుబంధం) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంజర్ల భాస్కర్ ఆధ్వర్యంలో పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే నాగరాజు చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడారు. గత ప్రభుత్వాలు వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంచేవని, పంచాయతీ పాలకవర్గ దయాదాక్షిణ్యాలపై జీతాలు ఆధారపడేవని చెప్పారు. మంత్రి సీతక్క చొరవతో సీఎం రేవంత్‌రెడ్డి పంచాయతీ సిబ్బందికి ప్రతినెలా 1న గ్రీన్ చానల్ ద్వారా నేరుగా బ్యాంక్ ఖాతాలో వేతనం జమ చేసేందుకు నిర్ణయిస్తూ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారంటూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇబ్రహీం, రమేశ్, యాకూబ్, స్వామి, వెంకటరమణ, చందర్, మల్లయ్య, వీరభద్రు, రవి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘానికి రూ.5 లక్షల విరాళం



గీసుకొండ : మండల కేంద్రంలోని గీత లక్ష్మి నారాయణ పొదుపు సంఘానికి గ్రామానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంకు మేనేజర్ పెగళ్ల పాటి లక్ష్మినారాయణ, గీత దంపతులు సోమవారం రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మినారాయణ మాట్లాడారు. సుమారు మూడున్నరేళ్ల క్రితం 120 మంది మహిళలతో సంఘాన్ని స్థాపించగా ప్రస్తుతం రూ.4 లక్షల టర్నోవర్‌కు చేరుకుందని చెప్పారు. ప్రతినెలా 10వ తేదీన సంఘం కార్యకలాపాలను మహిళలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశ్యంతో విరాళం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు కర్ణకంటి రజిత, కోశాధికారి కత్తి హేమలత, గౌరవ సలహాదార్లు కక్కెర్ల సుజాత, సభ్యులు కోల నిర్మల, వీరగోని హేమలత, కోల రజిని, వీరగోని భవానీ, మహ్మద్ యాకూబీ, ముల్క స్రవంతి, వీరాటి శ్రీలత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కర్ణకంటి రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పర్వతగిరి : మండలంలోని సోమ్లాతండాలో భుక్యా వెంకన్న ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సోమవారం పరామర్శించారు. అనంతరం గోపనపల్లిలో ఉప్పలయ్య, నాంపల్లి రాజయ్య, నాంపల్లి దూడయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఆయన కలిసి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం లింగాల లక్ష్మినారాయణ, నాంపల్లి లచ్చమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని కలిసి ఆర్థికసాయం అందించారు. అలాగే కొంకపాకలో గంధం సాయిలు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ సూర లింగయ్య గుండె సమస్యతో బాధపడుతుండగా ఆయన ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులున్నారు.

నివాళి

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త మేస్త్రీ కొండేటి లక్ష్మయ్య (55) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి స్థానిక ఎమ్మెల్యే నాగరాజు సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కౌన్సిలర్ సమ్మెట సుధీర్, చీటూరి రాజు, వెంకన్న, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

నర్సంపేట రూరల్: చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి చెందిన ఘటన రామవరంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై అరుణ్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా అశ్వాపురం మండలం మెట్టుగూడకు చెందిన వల్లాల మోహన్ (65) 15 ఏళ్లుగా రామవరంలో ఉంటున్నారు. ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వరంగల్‌లోని ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తవ్వి.. వదిలేశారు

- పది రోజులుగా వన్‌వేలో ప్రయాణం
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికుల్లో భయాందోళన

నల్లబెల్లి : నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి.. అసలే సంక్రాంతి పండగ సమయం.. వాహనాల రాకపోకలతో రద్దీ పెరిగిపోయింది.. రోడ్డు మరమ్మతు పేరుతో జాతీయ రహదారిని ఒకవైపు తవ్వారు..ఆ తవ్విన ఆ రహదారిని మరమ్మతు చేయకుండా వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని రుద్రగూడెంలో ధ్వంసమైన జాతీయ రహదారి మరమ్మతు పనుల్లో నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన రహదారి కావడంతో రోడ్డు అక్కడక్కడా కుంగిపోయింది. దీంతో ధ్వంసమైన జాతీయ రహదారి మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. మరమ్మతు పేరుతో బీటీని తవ్వి వదిలేశారు. పది రోజులు గడచినా మరమ్మతులు చేపట్టలేదు. దీంతో వాహనాల ప్రయాణం వన్‌వేగా మారిపోయింది. ఎలాంటి వాహనం వచ్చినా ఆగిపోవడం లేదా ప్రమాదభరితంగా ప్రయాణం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలతోపాటు చిన్న వాహనాలు ఎదురెదురుగా ప్రమాదకర రీతిలో రాకపోకలు సాగిస్తున్నాయి. ధ్వంసమైన రహదారి బీటీని తవ్వి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాల బారిన పడిన ఘటనలూ ఇటీవల చోటుచేసుకున్నాయి. రాత్రివేళలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. భారీ వాహనాలు వస్తే తవ్విన రోడ్డుపై మీదుగా ముందుకు సాగలేక ఇబ్బంది ఎదురౌతోంది. సంబంధిత ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జాతీయ రహదారి మరమ్మతు పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని, ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రుద్రగూడెంలో తవ్విన జాతీయ రహదారి

పనులు పూర్తి చేయాలి

ధ్వంసమైన జాతీయ రహదారి మరమ్మతు పేరుతో తవ్వడంతో ప్రమాదకరంగా ఉంది. వారం రోజులు గడిచినా పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారు. ఇప్పటికైనా సంబంధిత ఎన్‌హెచ్ అధికారులు స్పందించి జాతీయ రహదారి మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

-మామిండ్ల రాజిరెడ్డి, రుద్రగూడెం

పనులు చేపడతాం

ప్రభుత్వ నిబంధనల మేరకు రుద్రగూడెంలో ధ్వంసమైన ఎన్‌హెచ్ రహదారి మరమ్మతు పనుల్లో భాగంగా బీటీ లేయర్ తొలగించాం. మరమ్మతు పనులు పూర్తి చేయించడంలో కొంత జాప్యమైన విషయం వాస్తవమే. ప్రమాదాలు జరగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశాం. త్వరలో పనులు మొదలు పెట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

- రమేశ్, ఎన్‌హెచ్, సైట్ ఇంజనీర్

నర్సంపేట : అయ్యప్పస్వామి ఆలయంలో భోగి మంట పెడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ మాధవశంకర్



ఊరూరా భోగి సంబురాలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, చెన్నారావుపేట, నెక్కొండ, ఖానాపూర్, నల్లబెల్లి, దుగ్గొండి, సంగెం, గీసుకొండ, పర్వతగిరి, రాయపర్తి, తదితర మండలాల్లో సోమవారం ఊరూరా భోగి సంబురాలు జరిగాయి. ప్రధాన కూడళ్లలో మంటలు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచే ఇళ్ల ముందు మహిళలు, బాలికలు ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. తల్లిదండ్రులు పిల్లలపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. హరిదాసులు, గంగిరెద్దుల వాళ్లు ఇంటింటికీ తిరుగుతూ సందడి చేశారు.



నర్సంపేట : సిద్ధార్థనగర్‌లో భోగి మంటలు వేస్తున్న కాలనీవాసులు



చెన్నారావుపేట : గొబ్బెమ్మలు పెడుతున్న చిన్నారులు



దుగ్గొండి : స్వామిరావుపల్లిలో...

కబడ్డీ పోటీలో ‘అశోక్‌నగర్’ జయకేతనం



విజేతగా నిలిచిన క్రీడాకారుల జట్టుతో సారంగపాణి, తదితరులు

నల్లబెల్లి : మండలంలోని నారక్కపేటలో మాజీ సర్పంచ్ చెన్నమల నర్సయ్య (క్రిష్ణన్న) జ్ఞాపకార్థం నిర్వహించిన డివిజన్ స్థాయి కబడ్డీ పోటీల్లో ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని జయకేతనం ఎగరేసింది. ఫైనల్ మ్యాచ్‌లో అశోక్‌నగర్ జట్టు ప్రథమ, నాచినపల్లి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. జెయింట్ విన్నర్‌గా వెంకటాపూర్, నర్సంపేట స్టేడియం జట్లు ప్రతిభ చాటాయి. ఫైనల్ మ్యాచ్‌లో పాల్గొన్న క్రీడకారులను మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి అభినందించి మాట్లాడారు. క్రీడాకారులు భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో రాణించే దిశగా తోడ్పాటు అందిస్తామని చెప్పారు. గ్రామ అభివృద్ధిలో నర్సయ్య సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్, అధ్యక్షుడు రాంరెడ్డి, సహాయ కార్యదర్శి మల్లికార్జున్, మండల అధ్యక్షుడు దామ సాంబయ్య. శాతవాహన యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ చెన్నమల చైతన్య, మాజీ ఎంపీటీసీ గుండాల రాజకొమురయ్య, నాయకులు వక్కల చంద్రమౌళి, మోర్తాల రామారావు, మాట్నేని చంద్రశేఖర్, గణేశ్, పీడీలు గుండేటి రవీందర్, భిక్షపతి, రవికుమార్, విజేందర్, శేఖర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



నర్సంపేట : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని సీపీఐ కాలనీలో జాతీయ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్, బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి ఐత శ్రీకళ, రెండో బహుమతి గడ్డం సంతోష, మూడో బహుమతి శ్రీలత గెలుచుకున్నారు. కవిత అధ్యక్షతన విజేతలకు షీల్డ్, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంజాల రమేశ్, జిల్లా మహిళా కార్యదర్శి చంద్రకళ, నాయకులు అక్కపెల్లి రమేశ్, చింతకింది కుమారస్వామి, గోవర్ధనచారి, మునీశ్వర్, యాదన్న, వెంకన్న, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

గవిచర్లలో..



సంగెం : మండలంలోని గవిచర్లలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మాజీ ఎంపీటీసీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు వెల్దండ సురేశ్, నాయకులు గాలి భిక్షపతి, గాలి తిరుపతి, వేల్పుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి రంగనాథుల కల్యాణం



ఖానాపురం : పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, తదితరులు

ఖానాపురం : మండలవ్యాప్తంగా సోమవారం గోదాదేవి రంగనాథుల కల్యాణం వేడుకగా జరిగింది. మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, బుధరావుపేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీల అధ్యక్షులు వెంకటనర్సయ్య, వెంకటనారాయణ, చెడిపాక ఉపేందర్, వెంకటప్రసాదరావు, సుబ్బారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ హరిబాబు, జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో నాయకులు మురళి, ఓర్సు తిరుపతి, గిరగాని నర్సయ్య, చాంద్‌పాషా, రవి, లాల్, చిట్యాల తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి కల్యాణం

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరిగుట్టపై ఆలయంలో శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహించారు. గ్రామ ప్రత్యేక అధికారి రణధీర్, ఆలయ కమిటీ బాధ్యులతో కలిసి పట్టువస్త్రాలు ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించారు. అనంతరం శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి, భూదేవి, శ్రీదేవి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ఆవరణలో ప్రధాన అర్చకులు సుముద్రాల సుదర్శనాచార్యుల వేదమంత్రాల నడుమ కల్యాణం నిర్వహించారు. అనంతరం దేవతా మూర్తులను ఆలయంలో ప్రతిష్ఠించారు. భక్తులు మొక్కులు చెల్లించారు. ముడుపులు కట్టారు. ఎస్సై రాజేశ్‌రెడ్డి, తదితరుల సతీసమేతంగా పూజలు నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఇన్‌చార్జ్ మాదారపు భాస్కర్, ఆలయ కమిటీ బాధ్యులు మల్లం సాగర్, అనుముల అశోక్, చీకటి రాజు, వెంకటేశ్వర్లు, బొమ్మనపల్లి గణేశ్, గ్రామ కార్యదర్శి శ్యాంప్రసాద్, శ్రీనాథ్, కారోబార్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట : కల్యాణ వేడుకలో భక్తులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నర్సంపేట : నాటి ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లిలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో 2007–08 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొక్కరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. సుమారు 17 ఏళ్ల కిందటి స్నేహ మాధుర్యాన్ని గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. నాటి ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు అక్బర్, రాజు, రాజ్‌పాల్‌లను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రంగు రాంబాబు, బుర్ర శ్రవణ్, అనుముల చిరంజీవి, సింగిరెడ్డి రమేశ్, దామర రాజు, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : ల్యాబర్తి హైస్కూల్‌లో..

ల్యాబర్తి హైస్కూల్‌లో..

వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1990–91 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం సమ్మేళనం జరుపుకున్నారు. సుమారు 3 దశాబ్దాల తర్వాత కలుసుకున్న నేపథ్యంలో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆనందం పంచుకున్నారు. నాడు తమకు బోధించిన ఉపాధ్యాయులు భాస్కర్, దామోదర్‌లను ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు భాస్కర్, దామోదర్ మాట్లాడారు. స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని దీవించారు. కార్యక్రమంలో కెయూసీ రాజనీతి విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సంకినేని వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

‘సంఘమిత్ర’ కార్యకలాపాల విస్తరణకు కృషి చేస్తాం



నర్సంపేట : సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్ కార్యకలాపాల విస్తరణకు కృషి చేస్తానని జనరల్ సెక్రటరీ పిడుగు కమల్ తెలిపారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఆయన్ను ఆర్గనైజేషన్ జనరల్ సెక్రెటరీగా బాల భవన్‌లో గొంగళ్ల అశోక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఆర్గనైజేషన్ కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమల్ మాట్లాడారు. స్విమ్మర్ రాజు మాట్లాడుతూ బాల భవన్ అభివృద్ధికి తాను, యువ నేతాజీ ఫౌండేషన్ ఎల్లప్పుడూ సహకరించనున్నట్లు చెప్పారు. దాతల సహకారంతో బాల భవన్ ద్వితీయ వార్షికోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సభ్యులు రాణి, ప్రశాంత్, రవి, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యం

చెన్నారావుపేట : ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఫిబ్రవరి 7న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెయ్యి గొంతుకలు, లక్ష డప్పుల సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్ల సునీల్ కోరారు. మండల కేంద్రంలో సంఘం డివిజన్ అధ్యక్షులు అబ్బదాసి యాకన్న, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సదానందం ఆధ్వర్యంలో సోమవారం డప్పుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన చిరుతం సాయిరాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడితో కలిసి జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ చదువుకున్న విద్యార్థులు, అధ్యాపకులు సోమవారం రూ.17 వేల సాయం అందజేశారు. తొలుత సాయిరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జయముఖి కళాశాల ఈసీఈ విభాగ ప్రొఫెసర్ మస్తాన్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన యాట అజయ్‌కు అతనితో కలిసి జాగృతి స్కూల్‌లో చదువుకున్న మిత్రులు రూ.20 వేల సాయం అందజేశారు. అజయ్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని అతడి స్నేహితులు తొలుత పరామర్శించారు. కార్యక్రమంలో కెంచ ప్రవీణ్, అన్న భీరేంద్ర, పులిశేరు రాజేందర్, వల్ల వేణు, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, నూనె క్యాన్లు సాయం

రాయపర్తి : మండలంలోని కొండూరులో గంగారపు ముత్తమ్మ, శివరామపురంలో నాగపురి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ప్రతినిధి, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్లు అందజేశారు. తొలుత బాధిత కుటుంబాలను పరామర్శించారు. పేద కుటుంబాలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, సీనియర్ నాయకుడు కర్ర రవీందర్‌రెడ్డి, మండల అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, మాజీ సర్పంచ్ చెడుపాక కుమారస్వామి, నాయకులు నాగపురి సోమయ్య, దేశబోయిన ఉపేందర్, భూక్య జగన్, పూస వెంకటేశం, పెండ్లి వెంకన్న, రవి, శాస్త్రబోయిన యాకయ్య, ఎనబోతుల మల్లేశం, వీరని వెంకన్న, చెడుపాక యాకయ్య, వీరస్వామి, ప్రభాకర్, అశోక్, రవి, కృష్ణమూర్తి, శ్రీను, ప్రసాద్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రక్షణకు చట్టాలు చేయాలి

- పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్

నర్సంపేట : వ్యవసాయ రక్షణకు అవసరమైన చట్టాలు చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలమకంటి రాజేందర్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు గట్టి కృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతు వ్యతిరేక చట్టాల ప్రతులను భోగి మంటల్లో దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం రాజేందర్, కృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని నాలుగేళ్ల క్రితం దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఉద్యమంలో దాదాపు 700 మంది రైతులు ప్రాణత్యాగం చేయగా వాటి రద్దుకు ప్రధాని మోదీ హామీ ఇచ్చి తదనంతరం విస్మరించారని విమర్శించారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పూలక్క, అఖిల భారత రైతు సంఘం నాయకులు రమేశ్, ఆకుతోట రాజు, ఎడ్ల రాజేశ్వర్, ఎర్రబెల్లి నర్సయ్య, కలకోట కుమార్, ఏసబోయిన ఐలన్న, ప్రదీప్, విజయ, వీరలక్ష్మి, సులోచన, సావిత్రి, సుజాత, నిర్మల, లింగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



చట్టాల ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

బౌద్ధ ఆత్మీయ పలకరింపు ఆచరణీయం

- టీవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జగదీశ్వర్

నల్లబెల్లి : ప్రాచీన బౌద్ధ ఆత్మీయ పలకరింపును సమాజం ఆచరించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ములుగు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెట్ డాక్టర్ జగదీశ్వర్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన రేషన్ డీలర్ జన్ను ప్రభాకర్ ఇంటి వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన యాది సభ, ఆత్మీయ బహుజన పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ చిత్రపటానికి డాక్టర్ జగదీశ్వర్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కడుపు సల్ల చేసే పేరుతో మద్యం సేవించడం సరికాదన్నారు. పండ్లు, పండ్ల రసాలు, డ్రైఫ్రూట్స్, చల్లతో కడుపు సల్ల చేసే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రేషన్ డీలర్‌గా ప్రభాకర్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందించారని గుర్తు చేశారు. అనంతరం బాధిత కుటుంబానికి పండ్లు, పండ్ల రసాలు, డ్రైఫ్రూట్స్, చల్ల అందజేసి పరామర్శించారు. కార్యక్రమంలో లెక్చరర్ ఇసాక్ స్వేరో, సోషల్ థింకర్స్ ఫోరం బాధ్యులు రఘుపతి, కొర్ర రమేశ్, కల్లెపల్లి రఘువరణ్, వినయ్, రత్నం, జయరావు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

‘పాకాల కాల్వల మరమ్మతుకు సహకరిస్తాం’

ఖానాపురం : మండలంలోని పాకాల కట్ట, కాల్వల మరమ్మతుకు సహకరిస్తామని ఎన్ఆర్ఐ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి, ఉమాకర్‌రెడ్డి ప్రకటించారు. మండలంలోని పాకాలలోని కట్టమైసమ్మకు కాంగ్రెస్ నాయకులతో కలిసి వారు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాకాల కాల్వలు, బోటింగ్ పాయింట్, తూములను సందర్శించి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. పాకాల కట్ట, కాల్వల మరమ్మతు పనుల కోసం తమ వంతుగా తోడ్పాటు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి రవీందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, సారంగపాణి, సురేశ్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



పాకాల కట్టను పరిశీలిస్తున్న ఎన్ఆర్ఐ, నాయకులు